www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
కర్నూలు, నంద్యాల జిల్లా
వైయస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లా

## మెగా యూత్ ఫోర్స్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్‌గా పండ్రా రంజిత్ కుమార్

**కడప జిల్లా కన్వీనర్‌గా**

**గొడ్డటి గురుశేఖర్ నియామకం**

**నియామక పత్రాలు అందజేసిన జాతీయ గౌరవ అధ్యక్షురాలు కొణిదెల సుస్మిత**



**కడప,జూలై26.అక్షరటైమ్స్:-** ఆంధ్రప్రదేశ్ మెగా యూత్ ఫోర్స్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్‌గా పండ్రా రంజిత్ కుమార్, కడప జిల్లా మెగా యూత్ ఫోర్స్ కన్వీనర్‌గా గొడ్డటి గురుశేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని చిరంజీవి బ్లడ్ బ్యాంకులో నిర్వహించిన కార్యక్రమంలో మెగా యూత్ ఫోర్స్ జాతీయ గౌరవ అధ్యక్షురాలు కొణిదెల సుస్మిత, జాతీయ అధ్యక్షుడు ఏడిద బాబి నూతనంగా నియమితులైన వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన పండ్రా రంజిత్ కుమార్, గొడ్డటి గురుశేఖర్ లు మాట్లాడుతూ, మెగా అభిమాన సంఘాలు, అభిమానులను ఏకతాటిపై నడిపిస్తూ నెక్స్ట్ జనరేషన్ అభిమానులను ప్రోత్సహించడంతో పాటు సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రజలకు చేరవేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. మెగా హీరోలకు అభిమానులను మరింత చేరువ చేసే దిశగా తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశం కల్పించిన మెగా యూత్ ఫోర్స్ జాతీయ గౌరవ అధ్యక్షురాలు కొణిదెల సుస్మితకు, అఖిల భారత చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షుడు రవణం స్వామినాయుడికి, మెగా యూత్ ఫోర్స్ జాతీయ అధ్యక్షుడు ఏడిద బాబికి పండ్రా రంజిత్ కుమార్, గొడ్డటి గురుశేఖర్ లు కృతజ్ఞతలు తెలిపారు.

# నంద్యాలలో రెండు రోజుల రాష్ట్ర స్థాయి చెవి,ముక్కు, గొంతు శస్త్ర చికిత్సల సదస్సు,కార్యశాల







**నంద్యాల మధుమణి చెవి,ముక్కు,గొంతు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో**

**నంద్యాల, ఆంధ్రప్రదేశ్ చెవి ముక్కు గొంతు వైద్యుల సంఘం పర్యవేక్షణలో నిర్వహణ**

**శిక్షణ పొందిన ఆరు రాష్ట్రాల నుండి హాజరు అయిన 170 మంది చెవి, ముక్కు,గొంతు వైద్యులు**

**కార్యశాలలో శస్త్ర చికిత్సలు చేసిన చెన్నైకి చెందిన ప్రముఖ చెవి, ముక్కు, గొంతు వైద్యులు డాక్టర్ ఆహిలా స్వామీ,డాక్టర్ జయప్రకాశ్ రెడ్డి, డాక్టర్ మధుసూధన రావు,డాక్టర్ మణి దీప్**

**నంద్యాల, జులై26. అక్షరటైమ్స్:-** నంద్యాలలో ఆంధ్రప్రదేశ్ ఈ.ఎన్.టి వైద్యుల సంఘం ఆధ్వర్యంలో,నంద్యాల మధుమణి నర్సింగ్ హోమ్ నిర్వహణలో స్థానిక మధు మణి చెవి,ముక్కు,గొంతు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో శని,ఆది వారాలలో రెండు రోజుల రాష్ట్ర స్థాయి చెవి,ముక్కు, గొంతు వైద్య వైజ్ఞానిక సదస్సు,శస్త్ర చికిత్సల ప్రత్యక్ష ప్రసార శిక్షణా కార్య శాల ( వర్క్ షాప్) నిర్వహించారు. మధుమణి నర్సింగ్ హోమ్ నిర్వాహకులు డాక్టర్ మధుసూదనరావు,డాక్టర్ నాగమణి డాక్టర్ మణిదీప్ ల నిర్వహణలో ఎర్పాటు చేసిన ఈ రెండు రోజుల సదస్సు లో ఆంధ్రప్రదేశ్ ఈ ఎన్ టి వైద్యుల సంఘం అధ్యక్షులు డాక్టర్ జయప్రకాశ్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్, ఆంధ్ర నాగార్జున యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ వేణుగోపాలరెడ్డి, రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ జి. రామకృష్ణారెడ్డి, ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ పరిశీలకులు డాక్టర్ సింగరి ప్రభాకర్, అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సు ప్రారంభించారు. ఈ సందర్భంగా సదస్సు నిర్వాహక చైర్మన్ డాక్టర్ మధుసూదనరావు మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా ఈ శస్త్ర చికిత్సల కార్యశాల మరియు సదస్సు నిర్వహిస్తున్నామని ఇది 16 వ సదస్సు అన్నారు. పలు రాష్ట్రాల నుండి చెవి ముక్కు గొంతు వైద్యులు నంద్యాలకు ఆధునిక శస్త్ర చికిత్సల శిక్షణ కోసం రావడం నంద్యాలకు గర్వకారణం అన్నారు. నిర్వాహక కార్యదర్శి డాక్టర్ మణిదీప్ మాట్లాడుతూ ఈ రెండు రోజుల సదస్సులో ఆరు రాష్ట్రాల నుండి 170 మంది చెవి, ముక్కు, గొంతు వైద్యులు ప్రతినిధులుగా పాల్గొని మధు మణి సమావేశ భవనంలో స్క్రీన్ పైన, ఆసుపత్రి ఆపరేషన్ థియేటర్లో జరుగుతున్న శస్త్ర చికిత్సల ప్రత్యక్ష ప్రసారం తిలకిస్తూ ఆపరేషన్ చేస్తున్న వైద్యునితో తమ సందేహాలు నివృత్తి చేసుకుని శిక్షణ పొందుతారని తెలిపారు. డాక్టర్ అహిలా స్వామి,డాక్టర్ జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ ఇటువంటి వైజ్ఞానిక సదస్సులు యువ వైద్యులకి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారు భవిష్యత్తులో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి దోహదపడుతుందని అన్నారు. ఆదివారం జరిగిన సదస్సు ముగింపు కార్యక్రమంలో ఐఎంఏ జాతీయ కేంద్ర కమిటీ సభ్యులు,రాష్ట్ర ఐఎంఏ మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ ఈ పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే యువ వైద్యులు నిరంతరం ఆధునిక విధానాలను నేర్చుకుని నైపుణ్యాలను పెంచు కోవలసిన అవసరం ఉందని అన్నారు. డాక్టర్ సింగరి ప్రభాకర్ మాట్లాడుతూ వైద్య రంగంలో అనునిత్యం గణనీయమైన మార్పులు ప్రపంచవ్యాప్తంగా జరుగుతూ ఉంటాయని, వాటిని తెలుసుకోవడం కోసం వైద్యులు నిరంతర అధ్యయనం చేయడం చాలా అవసరం అన్నారు. జాతీయస్థాయి ప్రముఖ చెవి ముక్కు గొంతు చికిత్స నిపుణులు డాక్టర్ అహిలా స్వామి, డాక్టర్ జయప్రకాశ్ రెడ్డి,డాక్టర్ మధుసూదన రావు, మధుమణి ఆసుపత్రి చెవి ముక్కు గొంతు శస్త్ర చికిత్స నిపుణులు మణిదీప్ కలసి రెండు రోజులలో 20 శస్త్ర చికిత్సలు చేస్తూ యువ వైద్యులకు మెళకువలు వివరించారు. ఆపరేషన్లకు అవసరమైన క్లిష్టమైన అనస్తీసియా ప్రక్రియ ప్రముఖ వైద్యులు డాక్టర్ రవి కృష్ణ, డాక్టర్ మాధవి, డాక్టర్ వంశీ నిర్వహించారు. డాక్టర్ అహిలా స్వామి, డాక్టర్ జయప్రకాశ్ రెడ్డి లను డాక్టర్ మధుసూదన రావు కుటుంబ సభ్యులు ఘనంగా సత్కరించారు. సదస్సు ప్రారంభ, ముగింపు కార్యక్రమాలలో డాక్టర్ నాగమణి,సదస్సు నిర్వాహక కార్యదర్శి డాక్టర్ మణిదీప్, కోఆర్డినేటర్ డాక్టర్ రోహిత్, డాక్టర్ లోచన రెడ్డి,మధుమణి కుటుంబ సభ్యులు డాక్టర్ మధుప్రీతి,ప్రణీత్, సింధు,వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన 170 మంది చెవి ముక్కు గొంతు వైద్యులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్

**కార్గిల్ యుద్ధ వీరులకు సత్కారం**

**ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న సీనియర్ సభ్యులు రవి ప్రకాష్**



**నంద్యాల,జులై26.అక్షరటైమ్స్:-** కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కార్గిల్ యుద్ధ వీరులను సత్కరించి, అమరులైన వీర సైనికులకు నివాళు లర్పించారు. నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సందీప్ అధ్యక్షతన, కార్యదర్శి మేడా చంద్రశేఖర్, కోశాధికారి సురేష్ ల నిర్వహణలో, సీనియర్ లయన్స్ సభ్యులు జి. రవి ప్రకాష్ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న వీర సైనికులు శ్రీనివాసులు, మురళి లనుశాలువా, పూల మాల,జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ సేవా సంస్థ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ పాల్గొని మాట్లాడుతూ 1999 లో కార్గిల్ ప్రాంతాన్ని ఆక్రమించిన పాకిస్తాన్ సైనికుల్ని తరిమికొట్టి భారత ఆధీనంలోకి తెచ్చుకున్న ఈ రోజును కార్గిల్ విజయ దినోత్సవం గా నిర్వహించి, అమరులైన వీర సైనికులకు నివాళు లర్పించి వారి త్యాగాలను మననం చేసుకుంటామని అన్నారు. వారి స్ఫూర్తిగా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాల్సిన అవసరం ఉందని అన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సందీప్ మాట్లాడుతూ సరిహద్దులలో అహర్నిశలు దేశాన్ని కాపాడుతున్న వీర జవాన్ల త్యాగాలు గుర్తుంచుకుని ,దేశ సమగ్రతను కాపాడడంలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధ వీరులు శ్రీనివాసులు,మురళి మాట్లాడుతూ తాము కార్గిల్ యుద్ధంలో ప్రత్యక్షంగా పాల్గొన్నామని అయితే ఎందరో వీరుల ప్రాణ త్యాగం వల్లే కార్గిల్ ని మన ఆధీనంలోకి తెచ్చుకోగలిగామని అన్నారు. ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న రవి ప్రకాష్ మాట్లాడుతూ నంద్యాల లయన్స్ క్లబ్ ప్రతి ఏటా కార్గిల్ విజయ దివస్ రోజున మాజీ సైనికులను ఆహ్వానించి సత్కరించడం ప్రశంసనీయం అన్నారు. ఈ సందర్భంగా రవి ప్రకాష్ తన పుట్టినరోజు పురస్కరించుకుని దివ్యాంగులకు ఒక నెల మందుల పంపిణీ కోసం ఆర్థిక సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజినల్ చైర్మన్ నిజాముద్దీన్, లయన్స్ జిల్లా పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ పీ.వీ.సుధాకర రెడ్డి, జోనల్ చైర్మన్ సోమేశుల నాగరాజు,సీనియర్ లయన్స్ సభ్యులు ఆంజనేయులు గుప్తా, బదిరి శెట్టి శ్రీకాంత్, రమణయ్య, చంద్రమోహన్,రోడ్డా సుంకయ్య,సాయి మనోజ్, రత్నకుమార్, అమిదల జనార్ధన్, చంద్రమోహన్, ఇమ్మడి రామకృష్ణుడు,తోట శ్రీనివాస్, సుహాస్ రాఘవ,రామయ్య పాల్గొన్నారు.

# మేం పోరాడాం మేం సాధించాం.!







**ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో పోరాటం ముగియలేదు మరింత ఉధృతంగా కొనసాగుతుంది**

**నంద్యాల,జులై26.అక్షరటైమ్స్:-** కేంద్ర విద్య శాఖ మంత్రి రాజీనామా చేసిన సందర్భంగా సాయిబాబా నగర్ సర్కిల్ లో ఎస్ఎఫ్ఐ,డివైఎఫ్ఐ,పిడిఎసు, ఎన్ఎస్యుఐ సంఘాల ఆధ్వర్యంలో బాణా సంచాలు పేలుస్తూ, కేక్ కటింగ్ చేసి సంబరాలు చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఆర్. నాయక్, డి వై ఎఫ్ ఐ పట్టణ కార్యదర్శి శివ,పిడిఎసు జిల్లా కార్యదర్శి రాంబాబు, ఎన్ ఎస్ యు ఐ జిల్లా కార్యదర్శి నిరంజన్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,ధర్మేంద్ర ప్రధాన్‌ను రాజీనామా చేయించే వరకు నిరంతరంగా పోరాడిన ప్రతి విద్యార్థికి, యువతకు, ప్రజాస్వామ్య శక్తులకు (NEP ణ్ఖీ×ూణూఖ,చీూఖ× జేజేలు తెలియజేస్తోంది. ఇది విద్యార్థుల ఐక్యత సాధించిన చారిత్రాత్మక విజయం. సంఘటిత విద్యార్థి శక్తి ముందు ఏ పాలకుడూ గొప్పవాడు కాదని ఈ పోరాటం మరోసారి నిరూపించింది. గత రెండు నెలలుగా కొనసాగిన విద్యార్థుల ఉద్యమం నరేంద్ర మోదీ ప్రభుత్వ అహంకార కోటను కదిలించింది. ఈ పోరాటంలో విద్యార్థులతో కలిసి నిలిచిన అన్ని ప్రజాస్వామ్య, ప్రగతిశీల విద్యార్థి, యువజన, ప్రజా సంఘాలకు ఎస్ఎఫ్ఐ , డివైఎఫ్ఐ ,పిడిఎసు , ఎన్ ఎస్ యు ఐ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తోంది. ముఖ్యంగా దేశవ్యాప్తంగా విద్యార్థి ఆగ్రహాన్ని శాంతియుతమైన, శక్తివంతమైన ప్రజాస్వామ్య ఉద్యమంగా మలచడంలో కీలక పాత్ర పోషించిన సీజెపి తో పాటు అన్ని ప్రగతిశీల విద్యార్థి సంఘాల నాయకత్వాన్ని అభినందిస్తోంది. ఈ విజయం కేవలం ఒక మంత్రి రాజీనామాతో ముగిసే విజయం కాదు. భారత విద్యా వ్యవస్థలో సమూల సంస్కరణల కోసం కొనసాగుతున్న పోరాటంలో ఇది ఒక ముఖ్యమైన మైలురాయి,భారత విద్యారంగాన్ని పట్టిపీడిస్తున్న వ్యవస్థాగత సంక్షోభం పూర్తిగా తొలగే వరకు మా పోరాటం వివిధ రూపాల్లో కొనసాగుతుంది. 20 మందికి పైగా విద్యార్థుల ప్రాణాలు బలిగొన్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (NEP) ను వెంటనే రద్దు చేయాలి. విద్యార్థి వ్యతిరేక విధానాలకు చట్టబద్ధత కల్పిస్తున్న జాతీయ విద్యా విధానం (NEP)-2020ను ఉపసంహరించుకోవాలి. పరీక్షల అక్రమాలు, వైఫల్యాల వల్ల నష్టపోయిన విద్యార్థులకు, వారి కుటుంబాలకు సంపూర్ణ న్యాయం జరగాలి. దేశంలోని ప్రతి విద్యార్థికి సమానమైన, న్యాయబద్ధమైన, సమగ్ర విద్య అందే వరకు మా ప్రతిఘటన ఆగదు. నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలకు వ్యతిరేకంగా మొదటిసారిగా ఉద్యమాన్ని ప్రారంభించిన సంఘాల్లో సీజెపి ఒకటి. గత ఐదేళ్లకు పైగా ఎన్ఇపి -2020కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరంతర పోరాటం చేస్తోంది. గత రెండు నెలలుగా నీట్ ప్రశ్నాపత్రం లీక్, ఎన్ టి ఏ వైఫల్యాలు, శాంతియుత నిరసనలపై ప్రభుత్వ నిర్బంధ చర్యలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా విద్యార్థులను సమీకరిస్తూ ఉద్యమాన్ని ముందుండి నడిపించింది. రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా విద్యార్థులను మరింత విస్తృతంగా సమీకరించి, మా డిమాండ్ల సాధన కోసం మరింత ఉధృతమైన ఉద్యమాలను చేపడతాం. ఈ పోరాటంలో తరాల మధ్య ఉన్న అంతరాలను చెరిపేస్తూ విద్యార్థులు, యువత, ప్రజలు చూపిన ఐక్యత, అంకితభావం, ధైర్యసాహసాలకు ఎస్ఎఫ్ఐ , డివైఎఫ్ఐ ,పిడిఎసు , ఎన్ ఎ సి వై హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తోంది.

## నంద్యాలలో 'యముడు' చిత్ర బృందం సందడి

**సినిమా సూపర్ హిట్ కావాలన్న మంత్రి ఫరూక్**



**నంద్యాల,జులై26.అక్షరటైమ్స్:-** త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న 'యముడు' చిత్ర బృందం నంద్యాల జిల్లా కేంద్రంలో సందడి చేసింది. సినిమా ప్రమోషన్స్ లో భాగంగా చిత్ర యూనిట్.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తో మరియు నంద్యాల టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ తో ప్రత్యేకంగా సమావేశమైంది. అనంతరం చిత్రానికి సంబంధించిన టీజర్ ను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మూవీ టీంతో కాసేపు ఆత్మీయంగా ముచ్చటించి, సినిమాకు సంబంధించిన విశేషాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ఆగస్టు 7వ తేదీన విడుదల కాబోతున్న 'యముడు' చిత్రం ఘన విజయం సాధించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను. నటీనటులు, సాంకేతిక నిపుణులు ఎంతో కష్టపడి ఈ చిత్రాన్ని తెరకెక్కించారని, వారి కష్టానికి తగిన ప్రతిఫలం ఖచ్చితంగా దక్కుతుందని అన్నారు . ఈ సినిమా ప్రేక్షకులను తప్పకుండా అలరిస్తుందని, బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ హిట్ కొట్టాలని కోరుకుంటున్నాను. మన రాయలసీమ బిడ్డ, ఈ చిత్ర హీరో, దర్శక-నిర్మాత జగద్ తో పాటు చిత్ర యూనిట్ సభ్యులందరికీ నా ముందస్తు శుభాకాంక్షలు" అని తెలిపారు. మంత్రి ఆత్మీయ పలకరింపు, ప్రోత్సాహం పట్ల 'యముడు' చిత్ర బృందం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది. ఆయన అందించిన మద్దతు తమలో ఎంతో ఉత్సాహాన్ని నింపిందని చిత్ర యూనిట్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. భారీ అంచనాల నడుమ ఆగస్టు 7న థియేటర్లలోకి వస్తున్న ఈ 'యముడు' సినిమాను ప్రేక్షకులందరూ ఆదరించి, పెద్ద హిట్ చేయాలని చిత్ర బృందం ఈ సందర్భంగా కోరింది.

## గాజులపల్లెలో కొత్త బోరు మోటరు ఏర్పాటు



**మహానంది,జులై26.అక్షరటైమ్స్:-** మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని ఒకటవ వార్డులో తాగునీరు మోటారు మరమ్మత్తులకు గురైంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం గాజులపల్లె టిడిపి నేత,గోపవరం సొసైటీ చైర్మన్ గంగవరపు ఉమామహేశ్వర్ రెడ్డి స్పందించి కొత్త మోటరును ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమయ్యే వసతులు కల్పించినప్పుడే పేద ప్రజలు సంతోషంగా ఉంటారని పేర్కొన్నారు. కొత్త బోరు మోటరు వేయించి ప్రజల నీటి సమస్యను తీర్చడంతో సొసైటీ చైర్మన్ కు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

## రౌడీ షీటర్లు అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

**మహానంది ఎస్సై రామ్మోహన్ రెడ్డి**



**మహానంది,జులై26.అక్షరటైమ్స్:-** రౌడీ షీటర్లు సమాజంలో మంచి నడవడికతో జీవించాలని మహానంది ఎస్ఐ ఎన్. రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మహానంది పోలీస్ స్టేషన్లో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం వారు జీవిస్తున్న విధానం, జీవనోపాధికి చేస్తున్న వృత్తులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ..రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగకుండా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు..అల్లర్లు, అలజడులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు..చెడు నడత కలిగిన రౌడీ షీటర్లపై పోలీసుల నిఘా ఉంటుందన్నారు.

## తాగునీరు వీధిలైట్లు సమస్య తీరేది ఎన్నడు

**గ్రామంలో వెలగని వీధిలైట్లు**

**డ్రైనేజీ వ్యవస్థ శూన్యం**

**రాత్రి అయితే విషపురుగుల సంచారం**



**నందవరం,జూలై26.అక్షర టైమ్స్:-** మండల కేంద్రంలో డ్రైనేజీ కాలువలు, చెత్తాచెదారంతో నిండిపోయి వాటి నుండి పెద్ద ఎత్తున దుర్వాసన వేదజల్లుతుందన్నారు. ఎక్కడపడితే అక్కడ చెత్త చెదారంతో కనిపిస్తుందని గ్రామస్తులు వాపోతున్నారు. చీకటి పడిందంటే రాత్రిపూట ఇంటి నుంచి బయటకు రావాలంటేనే భయపడాల్సి వస్తోంది. రాత్రి వేళల్లో బస్టాండు నుంచి ఇంటికి వెళ్లడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చీకట్లో పురుగు పుట్ర, పాములు తిరుగుతున్నాయని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. విద్యుత్ స్తంభాలకు వీధి బల్బులు ఏర్పాటు చేస్తే సరిపోతుంది. అయితే మూడు నెలలు కాలనీలో వీధి లైట్లు లేక చీకట్లో మగ్గుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్థానికంగా ఉన్న మండలంలో డ్రైనేజీ కాలవలు, వీధి దీపాలు, తాగునీరు కొరత లేకుండా అందించాలని ప్రజలు కోరుతున్నారు. దోమల బెడదా భరించలేకపోతున్నాం డ్రైనేజీ కాలువలను శుభ్రం చేయించి డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధుల నుండి బాధను భరిస్తూ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాను అన్నారు.

# వైఎస్ షర్మిల త్వరగా కోలుకోవాలి

## ఏపీసీసీ మీడియా చైర్మన్ డా" ఎన్.తులసి రెడ్డి




**వేంపల్లె,జూలై26.అక్షరటైమ్స్:–** శస్త్రచికిత్స చేయించుకున్న ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల త్వరగా పూర్తిస్థాయిలో కోలుకుని, సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజా జీవితంలోకి రావాలని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం వేంపల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో తులసి రెడ్డి మాట్లాడుతూ, షర్మిల త్వరగా కోలుకుని మళ్లీ ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు.

# తొలి ఏకాదశి సందర్భంగా శ్రీ లక్ష్మీ నరసింహ స్వామికి విశేష పూజలు

## పంచామృతాభిషేకం, సహస్రనామార్చన.. భక్తులకు అన్నదానం

## ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పిన్నపాటి నరసింహ హరిప్రసాద్





**పెండ్లిమర్రి,జూలై26.అక్షరటైమ్స్:–** తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని వెయ్యినూతలకోనలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో శనివారం విశేష పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, ప్రత్యేక నైవేద్యం, లక్ష్మీ నరసింహ పాశుపత సహిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి ఆశీస్సులు పొందారు. స్వామివారి ఆశీస్సులతో భక్తులందరికీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పిన్నపాటి నరసింహ హరిప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై తులసి నాగప్రసాద్ ప్రత్యేకంగా విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సజావుగా దర్శనం జరిగేలా తమ పోలీసు సిబ్బందితో అవసరమైన సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, సేవకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థుల పోరాట ఫలితమే కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా

## డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని



**బద్వేల్,జులై26.అక్షరటైమ్స్:–** విద్యార్థుల పోరాట ఫలితంగానే కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేశారని అని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని అన్నారు.ఇది విద్యార్థుల ఐక్యత సాధించిన చారిత్రాత్మక విజయం అన్నారు.ఈ పోరాటంలో విద్యార్థులతో కలిసి నిలిచిన అన్ని ప్రజాస్వామ్య ప్రగతిశీల విద్యార్థి యువజన ప్రజాసంఘాలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.ముఖ్యంగా దేశవ్యాప్తంగా విద్యార్థి అగ్రహాన్ని శాంతియుతమైన శక్తివంతమైన ప్రజాస్వామ్య ఉద్యమముగా మలచడంలో కీలక పాత్ర పోషించిన సి జె పి తో పాటు అన్ని విద్యార్థి సంఘాల నాయకత్వం ఉందన్నారు.పరీక్షల అక్రమాలు వైఫల్యాల వల్ల నష్టపోయిన విద్యార్థులకు వారి కుటుంబాలకు సంపూర్ణ న్యాయం జరగాలని,దేశంలోనే ప్రతి విద్యార్థికి సమానమైన న్యాయబద్ధమైన సమగ్ర విద్య అందే వరకు మా పోరాటం ఆగదన్నారు.ఈ పోరాటంలో తరాల మధ్య ఉన్న అంతరాలను చెరిపేస్తూ విద్యార్థులు, యువత, ప్రజలు చూపిన ఐక్యత అంకితభావం విద్యార్థి యువజన సంఘాలకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్కె మస్తాన్ షరీఫ్,ఎస్ కే ఆదిల్, రూరల్ కార్యదర్శి ముడమాల ఓబుల్ రెడ్డి,పట్టణ ఉపాధ్యక్షులు సుధాకర్, యువరాజ్, రవికుమార్, సహాయ కార్యదర్శిలు ప్రసాద్ రెడ్డి,నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర సుభిక్షం కోసం గండి క్షేత్రంలో వరుణ జపం

## సమృద్ధిగా వర్షాలు కురిసి రాష్ట్రం సస్యశ్యామలం కావాలని ప్రత్యేక ప్రార్థనలు

## ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సి. విశ్వనాథ్






**చక్రాయపేట,జూలై26.అక్షరటైమ్స్:–** రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షిస్తూ గండి క్షేత్రంలోని శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక వరుణ జపం నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు పాపాఘ్ని నది తీరంలో ఉదయం 9 గంటలకు పుణ్యాహవచనం, విశ్వక్సేన ఆరాధనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితులు వేదమంత్రోచ్చారణల మధ్య భక్తిశ్రద్ధలతో వరుణ జపాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని, పశు పక్ష్యాదులు అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో జీవించాలని సంకల్పించి ఈ ప్రత్యేక వరుణ జపాన్ని నిర్వహించినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సి. విశ్వనాథ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, ప్రధాన అర్చకులు కేసరి స్వామి, ముఖ్య అర్చకులు గోపాల ఆచార్యులు, వేద పండితులు రామ్మోహన్ శర్మ, రఘు స్వామి, ఆలయ సిబ్బంది పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరుణదేవుని అనుగ్రహంతో రాష్ట్రం సస్యశ్యామలంగా మారాలని భక్తులు ప్రార్థించారు.

# గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు కురుబ కురుమ కురువ కమిటీలు విజయవంతం







## రాష్ట్రంలో యువతలను చైతన్యం చేస్తున్న రాష్ట్ర కురుబ కురుమ కార్పొరేషన్ చైర్మన్ : మాన్వి దేవేంద్రప్ప

**ఆదోని,జూలై26.అక్షరటైమ్స్:–** ఆంధ్ర రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పార్టీ కోసం నిరంతర ప్రజల సేవ చేస్తున్న మన కురుబ మాన్వి దేవేంద్రప్పకు గుర్తించి రాష్ట్రంలో కురుబ-కురుమ కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కింది. ఈ పదవికి నిరంతరం ప్రజలకు మరియు యువతలకు చైతన్యం నింపుతూ ముందుకు సాగుతున్నారు, రాష్ట్ర బీసీ మంత్రి సవితమ్మ , కర్నూల్ ఎంపీ బస్తిపాటి నాగరాజు, చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప ఆంధ్ర రాష్ట్రంలో ఉన్న కురుబ కురుమ కులస్తులను చైతన్యం చేయాలని కర్నూల్ లో ఒక కార్యక్రమాన్ని నిర్వహించి రాష్ట్రంలో గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మన కులస్తులను కమిటీల ద్వారా చైతన్యం చేయాలని నిర్ణయం తీసుకున్నారు, అదే ప్రకారం రాష్ట్ర మొత్తం మండల కమిటీలు జిల్లా కమిటీలు నియోజకవర్గ కమిటీలు రెండు నెలల నుంచి ఏర్పాట్లు చేస్తున్నారు. కర్నూలు జిల్లా కురుబ సంఘ అధ్యక్షుడు కే మల్లికార్జున మరియు ఆదోని నియోజకవర్గం నూతనంగా ఎన్నికైన కురువ రాఘవేంద్ర ఆధ్వర్యంలో ఆదోని నియోజకవర్గం కమిటీని ఏర్పాటు చేసి యువతలను చైతన్యం పరిచినారు, ఈ కమిటీలో ఆదోని నియోజకవర్గం అధ్యక్షుడిగా కురువ రాఘవేంద్ర కురుబ సోదరులు సంతోషంగా ఎన్నుకున్నారు, అలాగే ఉపాధ్యక్షులు, కార్యదర్శిలు, కోశాధికారులు, సభ్యులు, సలహాదారులను, ఎన్నుకోవడం జరిగింది, ఈ కమిటీకి ముఖ్య అతిథిగా రాష్ట్ర కురుబ కురుమ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప అధ్యక్షత వహించారు. అనంతరం మీడియా సమావేశంలో కురుబ కురుమ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప మాట్లాడుతూ, కమిటీలు తీసుకోవడం ఒకటే కాదు కురువ కులస్తులను ఏకతాటిగా ఒకే దగ్గర చేరుస్తూ ముఖ్యంగా యువతను ప్రోత్సహిస్తూ చైతన్య పరంగా తీర్చిదిద్దాలని సూచించారు అలాగే కురుబ విద్యార్థులు విద్యను ఒక ఆయుధంగా మార్చుకొని చదువుకోని ఉన్నత స్థాయిలో ఉండాలని తన భావం వ్యక్తం చేశారు వచ్చే స్థానిక ఎలక్షన్లో మన కురుబలు ఎక్కడ పోటీ చేసిన కురుబలంత కలిసికట్టుగా గెలిపించుకోవాలని పేర్కొన్నారు.

# లోకేష్ సభకు సర్వం సిద్ధం కార్యకర్తల సమావేశ స్థలాన్ని పరిశీలించిన టిడిపి నేతలు

## లోకేష్ పర్యటన విజయవంతమే లక్ష్యం

## ఏర్పాట్లు పై జిల్లా అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ సమీక్ష

## జూలై 29 లోకేష్ పర్యటనపై విజయవంతం చారిత్రాత్మకంగా నిలవాలని పిలుపునిచ్చిన గుడిసె ఆది కృష్ణమ్మ





**ఆదోని,జూలై26.అక్షరటైమ్స్:–** మంత్రి నారా లోకేష్ ఆదోని పర్యటన విజయవంతానికి విస్తృత ఏర్పాట్లు కార్యకర్తల సమావేశం స్థలాన్ని పరిశీలించిన జిల్లా అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ ఈనెల 29వ తేదీన విద్య, ఐటీ మరియు ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ ఆదోని పర్యటనకు రానున్న సందర్భంగా నిర్వహించనున్న తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశం కోసం ఎంపిక చేసిన సభా స్థలాన్ని కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఆదోని టీడీపీ ఇన్‌చార్జ్ మీనాక్షి నాయుడు , జోనల్--5 ఇన్‌చార్జ్ శ్రీనివాస రెడ్డి , కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ సూర్యనారాయణ , ఉమాపతి నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభావేదిక ఏర్పాట్లు కార్యకర్తలు కోసం కూర్చునే ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీటి సౌకర్యం, విద్యుత్, భద్రతా చర్యలు, మీడియా ప్రతినిధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించి సంబంధిత బాధ్యులకు అవసరమైన సూచనలు చేశారు. మంత్రి నారా లోకేష్ పర్యటన ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా జరిగేలా అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధి, యువతకు ఉపాధి, విద్యా రంగ బలోపేతం, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. మంత్రి నారా లోకేష్ పర్యటన ఆదోని ప్రాంత అభివృద్ధికి మరింత ఉత్సవం ఇస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని చారిత్రాత్మక విజయంగా నిలిపేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు శ్రీకాంత్ రెడ్డి,టిడిపి టౌన్ అధ్యక్షుడు తిమ్మప్ప , మారుతి నాయుడు, సిద్ధార్థ నాయుడు, పెద్ద రామంజి, వడ్డేమాన్ గోపాల్, అప్సర్ బాష, రంగన్న, వెంకటేష్ చౌదరి, రాఘవరెడ్డి, విజయ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# పిఆర్సీ పై ముఖ్యమంత్రి స్పందించాలి





**బద్వేల్,జులై26.అక్షరటైమ్స్:–** ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి చొరవ చూపాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు లు డిమాండ్ చేశారు. ఆదివారం ఉదయం కడప యుటిఎఫ్ భవన్ నందు జరిగిన ఆ సంఘ జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఒకవైపు ముఖ్యమంత్రి చెబుతూనే మరోవైపు సమస్యలు పరిష్కరించడంలో సాచివేత ధోరణి ప్రదర్శించడం సబబు కాదన్నారు. ఇటీవల మంత్రులతో జరిగిన చర్చల్లో పురోగతి కనిపించడం లేదని, ముఖ్యమంత్రి స్వయంగా ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. పిఆర్సీ కమిటీ వేయడంతో, పాటు 29% మధ్యంతర భృతి, పెండింగ్లో ఉన్న ఐదు డిఏల చెల్లింపు, సంపాదిత సెలవుల మంజూరు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకుంటుందని వారు తెలిపారు. విద్యా రంగ, ఉపాధ్యాయుల పలు సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. 2025 సంవత్సరములో బదిలీ కాబడిన కొందరు ఉపాధ్యాయులు రిలీవర్ లేని కారణంగా పాత పాఠశాలలోనే కొనసాగుతున్నారని, వారిని రిలీవ్ చేసి వారు కోరుకున్న స్థానాలకు పంపాలన్నారు. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో నాన్ లోకల్ కేటగిరీలో సెలెక్ట్ అయి సొంత జిల్లాలోకి వెళ్లాలనుకున్న వారికి అంతర్ జిల్లా సాధారణ బదిలీలు నిర్వహించి సొంత జిల్లాలకు వెళ్లే అవకాశం కల్పించాలని కోరారు. 2010కి ముందు నియమితులైన ఉపాధ్యాయులను టెట్ పరీక్ష నుండి మినహాయింపు ఇవ్వాలని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని కేంద్ర ప్రభుత్వంతో చర్చించి విద్యా హక్కు చట్టం 23 (1) కి సవరణ చేయాలన్నారు. చట్ట సవరణ చేసే వరకు ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ పరీక్షలను ఆఫ్ లైన్ విధానంలో నిర్వహించాలని కోరారు. గత ఏడాది ఉన్నత పాఠశాలలుగా ఉన్నతీకరించబడిన పాఠశాలలకు పలుచోట్ల తగినంత స్థలము లేక, తరగతి గదులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అలాంటి పాఠశాలలకు తగినంత స్థలము ఏర్పాటు చేయడంతో పాటు, అదనపు తరగతి గదుల నిర్మాణము చేపట్టాలన్నారు. సమగ్ర శిక్ష, కస్తూర్బా లలో కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్న ఉపాధ్యాయినీలు, సిఆర్ఎంటి, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లకు మరియు ఇతర సిబ్బందికి మినిమం టైం స్కేల్ అమలు చేయాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంతో పాటు దశలవారీగా వారిని రెగ్యులర్ చేయాలని కోరారు. సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న మెడికల్ రీయంబర్స్మెంట్ బిల్లులను త్వరిత గతిన మంజూరు చేసి, నగదు చెల్లింపులకు చర్యలు తీసుకోవాలని కోరారు. నాలుగు సంవత్సరాలుగా చెల్లింపులకు నోచుకోక పెండింగ్లో ఉన్న సరెండర్ లీవ్ బిల్లులను చెల్లించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాల గ్రాంట్లను గత సంవత్సరం 50 శాతం మాత్రమే విడుదల చేశారని, ఈ సంవత్సరమైనా పూర్తిస్థాయిలో పాఠశాల అభివృద్ధి నిధులను మంజూరు చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మనబడి మన భవిష్యత్తు (నాడు-నేడు) లో భాగంగా గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా మిగిలిపోయిన తరగతి గదులను పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొని రావాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు ఎన్.నాగార్జున రెడ్డి, సహాధ్యక్షులు వై.రవికుమార్, డి.సుజాత రాణి, ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శులు ఎ.శ్రీనివాసులు, సి.వి.రమణ, ఎస్.ఏజాస్ అహ్మద్, జె.వి.సుబ్బారెడ్డి, డి.సుబ్బారావు, జి.గోపీనాథ్, ఎన్.కంబగిరి, కె.మురళీకృష్ణ, ఎ.డి.దేవదత్తం, కె.సుధాకర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.కృష్ణారెడ్డి ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.ప్రభాకర్ సిపిఎస్ జిల్లా కన్వీనర్ ఎన్.పవన్ కుమార్, అన్ని మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతీ సోమవారం సమస్యల పరిష్కారం కోసం 'ప్రజలతో కమీషనర్ ముఖాముఖీ'

**ప్రొద్దుటూరు,జూలై26.అక్షరటైమ్స్:–** ఈనెల 27 వ తేదీ సోమవారం నుండి సమయం ఉదయం 9 గంటల నుండి 10 గంటల వరకు ఒక గంట సమయం ప్రజల సమస్యల్ని పరిష్కరించడానికి ప్రజలతో కమీషనర్ ముఖాముఖి కార్యక్రమం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ విశ్వనాథ్ తెలిపారు. ఫిర్యాదు దారులు ఫోన్ చేయవల్సిన నంబర్స్: 9247563385/ 9849905863 ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం మున్సిపాలిటీ సేవలను ప్రజలకు మరింత చేరువుగా తీసుకెళ్లడం, దివ్యాంగులు, వయో వృద్ధులు, మహిళలు, చదువుకుంటున్న విద్యార్థులు, ఆరోగ్యం సహకరించలేనివారు, దూర ప్రాంతాలలో ఉన్న మన ప్రొద్దుటూరు పట్టణ ప్రజలు కోసం ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. ఇది ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అనుబందంగా ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. 'టైం లైన్' ప్రకారం సమస్యలను సంబంధిత శాఖా అధికారులు ఫోన్ ద్వారా నమోదు చేసుకున్న సమస్యలు పరిష్కరించినా ఒక విధంగా సత్వర పరిష్కారం





కోసం ఈ కార్యక్రమం ఉపయోగ పడుతుందని అధికారుల జవాబుదారితనం, పారదర్శకత కోసం, సత్వర పరిష్కారం కోసం ప్రొద్దుటూరు మున్సిపాలిటీ చేయగలిగిన సమస్యలను మాత్రమే ఫిర్యాదులుగా నమోదు చేయబడతాయని వివరించారు. మున్సిపల్ కమీషనర్, అసిస్టెంట్ మున్సిపల్ కమీషనర్, శానిటేషన్ సూపర్ వైజర్, శానిటరీ ఇన్స్పెక్టర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, రెవిన్యూ ఆఫీసర్, రెవిన్యూ ఇన్స్పెక్టర్, మెప్మా సెక్షన్ హెడ్, పిజిఆర్ఎస్ సెక్షన్ సిబ్బంది పర్యవేక్షణలో ఫోన్ ద్వారా నమోదైన ఫిర్యాదులు అదేరోజు సంబంధిత శాఖా అధికారులకు పరిష్కారం నిమిత్తం పంపడం జరుగుతుందని తెలిపారు. ప్రతీ సోమవారం ఈ ఫిర్యాదులపై సమీక్షా జరుగుతుందని, కమీషనర్ నేరుగా ఈ సమస్యలు పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. సమస్యలు ఉన్న ఫిర్యాదు దారుడు ఫోన్ చేసి ఫిర్యాదు దారుడు పేరుబి అడ్రస్‌బి సెల్ / ఫోన్ నెంబర్‌బి సమస్య వివరణ వంటి వివరాలు తెలపాలని కోరారు. ప్రొద్దుటూరు పట్టణ ప్రజలు అందరు సత్వర పరిష్కారం కోసం ఫోన్ ద్వారా సమస్యలు నమోదు చేసుకోమని విజ్ఞప్తి చేశారు. నిబంధనలు మేరకు ఫిర్యాదులు పరిష్కరించాబడతాయని సంబంధిత అధికారులకు సమాచారం అందించగలరని సూచించారు. ప్రొసీడింగ్స్ తయారు చేసి బట్వాడ చేసి రసీదు పొందగలరని తెలిపారు.

# మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు విస్తృతం చేసేందుకు కృషి



## మానవత మండల శాఖ చైర్మన్ బండ్రెడ్డి చక్రపాణి రెడ్డి

**వేంపల్లె,జూలై26.అక్షరటైమ్స్:–** మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవలను మరింత విస్తృతం చేసేందుకు కృషి చేస్తామని ఆ సంస్థ మండల శాఖ చైర్మన్ బండ్రెడ్డి చక్రపాణి రెడ్డి వెల్లడించారు. ఆదివారం స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాల ఆవరణలో మాసాంతర సమావేశాన్ని నిర్వహించారు. మానవత క్రియాశీలక కార్యక్రమాలతో పాటు కొత్త భవనం నిర్మాణానికి దాతలను సేకరించే విధానాలపై చర్చించారు. బాడీ ఫ్రీజర్స్, చైతన్య రథం కార్యక్రమాలపై సమన్వయాన్ని ఎలా బలోపేతం చేయాలో విశ్లేషించారు. దాతలు ముందుకు వచ్చి ఉత్తమ సమాజ నిర్మాణంలో తోడ్పాటు అందించాలని మానవత కుటుంబ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల సహాయ చైర్మన్ రంగారెడ్డి, మండల అధ్యక్షుడు పోలూరు సుభాష్, కార్యదర్శి శివ మహేశ్వర రెడ్డి, కోశాధికారి ధనుంజయ, ఉపాధ్యక్షుడు చైతన్య కుమార్, అడ్వైజర్ బోర్డు, కార్యవర్గ బోర్డు సభ్యులు డా.యోగీశ్వర బాబు, రాజారాం, రంగయ్య, రామ్మోహన్ రెడ్డి, బాబా షరీఫ్, గోవర్ధన్, అరవింద్, యస్దాన్, చలపతి, శ్రావణ్, తేజ తదితరులు పాల్గొన్నారు.